ప్రజాపాలన అంటే ఇండ్లు కూలగొట్టడమా?

● బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు

కాచిగూడ, సెప్టెంబర్ 29: కాంగ్రెస్ ప్రజాపాలన అంటే ముందస్తూ సమాచారం లేకుండా పేద, మధ్యతరగతి ఇండ్లు కులగొట్టడమా అని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రజాపాలన చేస్తున్నామని గొప్పలు చెబుతున్నారని, ప్రభుత్వం చేసే పనులకు ఏ మాత్రం పొంతనలేదని ఆరోపించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో కొన్నేండ్లుగా జీవనం గడుపుతున్నారని, అక్కడ నివసిస్తున్నా పేదలకు సమాచారం లేకుండా విచక్షణా రహితంగా అధికారులు వ్యవహరిస్తూ, ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజల పక్షాన బీజేపీ ఉద్యమిస్తోందని పేర్కొన్నారు.

జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నతుడు భగత్‌సింగ్

కాచిగూడ, సెప్టెంబర్ 29: దేశం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి భగత్‌సింగ్ అని అఖిల భారత యాదవ సంఘం అంబర్‌పేట ఇన్‌చార్జి జంగాల అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం నింబోలి అడ్డాలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ నిజమైన త్యాగం అంటే ఏమిటో చూపించిన వ్యక్తి భగత్‌సింగ్ అని, ఆయన చూపిన బాటలో నేటి యువత పయనించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియడారు. విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడంలో ఆయనకు ఎవరు సాటి రారని, భగత్‌సింగ్ జీవితం నేటి యవతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

ప్రైవేట్ టీచర్ల హక్కుల సాధనకు కృషి

● ఎమ్మెల్సీ సురభి వాణీదేవి
● ఘనంగా నగర ప్రైవేట్ టీచర్ల ఆత్మీయ సమ్మేళనం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, ఉప్పల శ్రీనివాస్ గుప్త, గంధం రాములు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 29: ప్రైవేట్ టీచర్ల హక్కుల సాధనకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. నగరంలోని బృందావన్ గార్డెన్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రైవేట్ టీచర్ల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఉత్తమ టీచర్లకు అవార్డుల ప్రదానం కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, టీపీసీసీ ప్రచార కమిటీ కో-కార్యదర్శి, ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు, ఎంబీసీ సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ప్రైవేట టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కార్తిక్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్ల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం అండగా ఉంటామని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్ది భావి భారత పౌరులను తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్ల హక్కుల కోసం, ప్రైవేట్ టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు మాట్లాడుతూ, ప్రైవేట్ టీచర్లు శ్రమ దోపిడీకి గురువుతున్నారని, అందరు ఐక్యంగా ఉండి హక్కుల సాధనలో కలిసి రావాలని, ప్రైవేట్ టీచర్ల అభివృద్ధి కోసం కేంద్ర సంఘం మొత్తం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ టీచర్లతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్కినేని ఆణి ముత్యాలు గ్రంథావిష్కణ చేస్తున్న వక్తలు

అక్కినేని ఆణి ముత్యాలు గ్రంథావిష్కణ

రవీంద్రభారతి, సెప్టెంబర్ 29: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో, తెలంగాణ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళా వాహిని ఆధ్వర్యంలో అక్కినేని శత జయంతి ముగింపు వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా సినీ విజ్ఞాన విశారద ఎస్వీ రామారావు రచించిన అక్కినేని ఆణి ముత్యాలు గ్రంథావిష్కరణ - అంకితోత్సవం కార్యక్రమం రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు, సారిపల్లి కొండలరావులు విచ్చేసి జ్యోతి ప్రజ్వనలం చేసి అక్కినేని ఆణిముత్యాలు గ్రంథాన్ని ఆవిష్కరించి, గ్రంథాన్ని సారిపల్లి కొండలరావుకు అంకితం చేశారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వర రావు తెలుగు వెండి తెరపై వెలుగు వెలిగిన గొప్ప నటుడని కొనియాడారు. ఆయన నటించిన సినిమాలు తెలుగు ప్రజలు ఉన్నంత వరకు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త వోలేటి పార్వతీశం, లంకా లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోపలి వాన కవితా సంపుటి ఆవిష్కరణ

లోపలి వాన కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 29: తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో లోపలి వాన కవితా సంపుటి గ్రంథావిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. రవీంద్రభారతిలో కుడికాల వంశీధర్ రచించిన లోపలి వాన కవితా సంపుటి గ్రంథావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య ఎన్.గోపి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ, లోపలి వాన కవితా సంపుటి చాలా అద్భుతమైన పుస్తకాన్ని రచించారని కవి వంశీధర్‌ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని మంచి పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముద్దాళి రఘురాం, డా.ఎస్.రఘు, సూర్యాధనుంజయ్, డా.గిన్నారపు ఆదినారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఆలయ ఈవోకు సన్మానం

గోల్కొండ కోట జగదాంబిక ఎలమ్మ ఆలయం ఈఓ శ్రీనివాసరాజు పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం స్థానిక నాయకులు సాయిబాబా చారి, శ్రీకాంతాచారి ఆయనకు సన్మానం చేశారు. శ్రీనివాసరాజు బోనాల ఉత్సవాలను సమర్థవంతగా నిర్వహించారని ఈ సందర్భంగా ప్రశంసించారు. - మెహిదీపట్నం

లంగర్‌హౌజ్‌లో ఉర్సు..

కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని లంగర్‌హౌజ్ డివిజన్‌లో ఆదివారం ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్, స్థానిక నాయకులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.- మెహిదీపట్నం

కేంద్ర మంత్రికి సన్మానం..

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నగరానికి విచ్చేన సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో కన్నె రమేశ్ యాదవ్, సి.వినోద్ యాదవ్, అరవింద్, సూర్యప్రకాశ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు. - కాచిగూడ, సెప్టెంబర్ 29

విజయవంతంగా స్కాలర్‌షిప్ టెస్ట్

స్కాలర్‌షిప్ టెస్టును పరిశీలిస్తున్న అకాడమీ నిర్వాహకురాలు బాలలత

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29: సివిల్స్ తమ లక్ష్యంగా పెట్టుకున్న గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ, టైలరో ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాలలత మాట్లాడుతూ ఈ టెస్టులో సుమారు 2500 మంది హాజరయ్యారని, టాప్ 10 విజేతలకు అకాడమీలో ఉచితంగా సివిల్స్ కోచింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. టాప్ 100 వచ్చిన వారికి ఉచితంగా సివిల్స్ మెటీరియల్స్‌ను అందిస్తామని తెలిపారు. ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు తమ లక్ష్యాన్ని చేరుకోడంలో తమ వంతు వారికి ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆమె తెలిపారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 29: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షలను వచ్చే నెల 8వ తేదీ నుంచి, ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) (ఈవినింగ్) రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నేడు పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ

ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) స్వర్ణోత్సవ సభను సోమవారం నిర్వహించనున్నట్టు పీడీఎస్‌యూ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి ఉదయం 11 గంటలకు టాగూర్ ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు సభను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ముంబై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీజీ కొల్సే పాటిల్, ప్రొ.హరగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు సతీశ్ చందర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు.

ప్రగతి పాఠశాలలో గుండె పరిరక్షణ దినోత్సవం

ర్యాలీ నిర్వహిస్తున్న నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ ప్రతినిధులు

అంబర్‌పేట/కాచిగూడ, సెప్టెంబర్ 29: అంబర్‌పేట బాపూనగర్‌లోని ప్రగతి విద్యానికేతన్ స్కూల్‌లో నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుండె పరిరక్షణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా షాదన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ అండ్ ప్రొఫెసర్ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ డాక్టర్ బోయిని జగన్ మోహన్ హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా లయన్ ఆకుల రవీందర్ రావు విచ్చేశారు. గౌరవ అతిథులుగా బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గందెమల్లి హాజరయ్యారు. గుండెకు సంబంధించిన పలు విషయాలు, జాగ్రత్తలను ముఖ్య అతిథి వివరించారు. కార్యక్రమానికి నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ అధ్యక్షుడు హేమంత్ బత్తుల అధ్యక్షత వహించారు. ఇందులో విద్యానికేతన్ చైర్మన్ ఎస్.మధుసూదన్, ప్రిన్సిపాల్ పి.సుధాకర్, పీఈటీ ఇ.భాస్కర్ పాల్గొన్నారు.

లడ్డూ అపవిత్రతపై నేడు నిరసనలు

సుల్తాన్ బజార్, సెప్టెంబర్ 29: తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీ పదార్థాల ఘటనను విశ్వ హిందూ పరిషత్ తీవ్రంగా ఖండిస్తున్నదని, ఈ దుశ్చర్యకు పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, కార్యదర్శి లక్ష్మీ నారాయణ, ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామిలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను చేపట్టాలని నిర్ణయించినట్టు వారు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన కూడళ్ళలో ప్లకార్డులతో శాంతియుత నిరసనలతో పాటు కలెక్టర్ కార్యాలయాలల్లో వినతి పత్రాలు సమర్పిస్తున్నట్లు వారు వివరించారు. ఈ నిరసన కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా హిందూ బంధువులందరూ పెద్ద ఎత్తున హాజరై శ్రీ వెంకటేశ్వర స్వామి పవిత్రతను కాపాడాలని కోరారు. ప్రధానంగా వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శివ భక్తులతో పాటు భజన మండలి సభ్యులు, వినాయక ఉత్సవ సమితి నిర్వాహకులు, దేవాలయాల కమిటీ సభ్యులంతా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

టోర్నీ విజయానికి కృషి చేసిన వారికి ధన్యవాదాలు

కాచిగూడ, సెప్టెంబర్ 29: కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో 68వ హెచ్‌డీఎస్ జీఎఫ్ ఇంటర్ హిమాయత్‌నగర్ జోనల్ లెవల్ ఆటల పోటీలను ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించారు. పాఠశాల పరిధిలో 14 ఏండ్ల నుంచి 17 ఏండ్ల వరకు గల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్ - 2024ను మండల పరిధిలోని అధికారులు, స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థులు తమ వంతు బాధ్యతగా పోటీపడి విజయవంతం చేశారు. అందుకు గాను పేరు పేరునా హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ ఈఓ ఎం.విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాచిగూడ ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, అంబర్‌పేట, హిమాయత్‌నగర్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కాచిగూడ ప్రభుత్వోన్నత పాఠశాల పీఈటీ వి.లక్ష్మణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

టూ వీలర్ మాయం

కాచిగూడ, సెప్టెంబర్ 29: హోటల్ ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జి.సురేశ్ కుమార్ తెలిపిన ప్రకారం, అంబర్‌పేటలోని ప్రేమ్‌నగర్ ప్రాంతానికి చెందిన ముజీబ్ కుమారుడు షేక్ అబ్దుల్ రహమాన్(23)ఆదివారం కాచిగూడ రైల్వేస్టేషన్ పరివార్ హోటల్ ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి, చాయ్ తాగి చూసేసరికి తన బండి కనిపించలేదు. చుట్టు పక్కల, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. రాత్రి రహమాన్ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నాట్య గురువు లక్ష్మికి డాక్టరేట్ ప్రదానం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 29: కూచిపూడి నృత్యంలో పదేండ్లుగా ఎంతో మంది చిన్నారులకు శిక్షణను ఇస్తూ, వారిని తీర్చిదిద్దుతూ భారతీయ సంస్కృతిని పరిరక్షించేందుకు కూచిపూడి నాట్య గురువు అవిటి లక్ష్మి (ప్రవీణ) విశేషంగా కృషి చేస్తున్నారు. నటరాజ నాట్యాలయ, న్యూ ఢిల్లీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అవిటి లక్ష్మి అందుకున్నారు. అర్జున్ అవార్డు గ్రహీత నేహా రాతి, బజాజ్ సీఈవో కవిత, వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్స్ వారి చేతుల మీదుగా నృత్య గురువు లక్ష్మికి న్యూఢిల్లీలో ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డా.అవిటి లక్ష్మిని వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని లక్ష్మి అన్నారు.

విజయవాడ వెళ్లే ప్రయాణికులకు శుభవార్త

శ్రీలత, రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్

సుల్తాన్ బజార్, సెప్టెంబర్ 29: ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా టీఎస్‌ఆర్‌టీసీ నిరంతరం కృషి చేస్తున్నదని రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీలత ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు పటాన్ చెరువు, బీహెచ్ ఈఎల్, రామచంద్రాపురం నుంచి విజయవాడ వైపు వెళ్ళే ప్రయాణికులకు ఆమె శుభవార్తను తెలిపారు. బీహెచ్‌ఈఎల్ డిపో నుంచి నూతనంగా ఓఆర్‌ఆర్ మీదుగా విజయవాడ వెళ్లేందుకు గాను నూతనంగా రెండు ఈ - గరుడ బస్సులను సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆమె వివరించారు. ఈ నూతన బస్సులు రామచంద్రాపురం, బీరంగూడ, చందానగర్, మియాపూర్, నిజాంపేట్ క్రాస్ రోడ్స్, హౌజింగ్ బోర్డు మీదుగా జేఎన్టీయూ, రైతు బజార్, మలేషియా టౌన్‌షిప్, శిల్పారామం, సైబర్ టవర్స్, మైహోమ్ భూజా, సైబరాబాద్ కమిషనరేట్, టెలీకాం నగర్ మీదుగా ఓఆర్‌ఆర్ నుంచి విజయవాడ వెళ్ళుతాయని అన్నారు. దీంతో విజయవాడ వెళ్ళే ప్రయాణికులకు ట్రాఫిక్ జామ్ సమస్య నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. ప్రతి రోజు రాత్రి 9.30 గంటలకు, 10.30 గంటలకు రామచంద్రాపురం నుంచి ఈ బస్సులు బయలుదేరుతాయని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాష్ట్రపతి నిలయంలో కళా మహోత్సవ్

బొల్లారం, సెప్టెంబర్ 29: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ ప్రదర్శనకు మొదటి రోజు సందర్శకులను ఆకర్షించింది. దేశంలో ఈశాన్య రాష్ట్రాల సుసంపన్నమైన, వైవిధ్యభరితమైన సంస్కృతిని పురస్కరించుకొని కలర్స్ ఆఫ్ ది నార్త్ ఈస్ట్ అనే పేరుతో ఆకర్షణీయమైన నృత్య ప్రదర్శనతో ప్రారంభించినట్టు నిలయం అధికారి రజనీప్రియ వెల్లడించారు. 8 రాష్ట్రాల నుంచి సంప్రదాయ నృత్య రూపాలను, నృత్య కళాకారులు అలరించారు. హస్తకళలను వీక్షించడానికి ప్రజలు విచ్చేశారు.

న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం

కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29: తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగపుత్రులు న్యాయవాద వృత్తిలో రాణించడం మంచి పరిణామం అన్నారు. ఐక్యంగా ఉంటూ అన్నిరంగాల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. హైకోర్టు న్యాయవాది పాక సాయి సంతోష్, డాక్టర్ దేశబోయిన రఘు, భూపతి, పల్లికొండ అరవింద్, దేశబోయిన భాస్కర్ తదితరలు పాల్గొన్నారు.

బీహార్ తరహాలో కులగణన చేపట్టాలి

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ, సెప్టెంబర్ 29: భావితరాల బీసీ యువకుల కోసం రాష్ట్రంలో బీహార్ తరహాలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. కాచిగూడలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల మనోభవాలను గ్రహించి మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో కులగణన చేసి నిజాయితీని నిరూపించుకున్నాడని పేర్కొన్నారు. అదే తరహాలో బీహార్‌లో కులగణన చేపట్టారని, కేంద్ర ప్రభుత్వం కుల గణన చేపట్టడం ద్వారా ఆయా కులాల ఆర్థిక, సామాజిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయన్నారు. కులగణన చేయాలని 16 రాజకీయ పార్టీలు మద్దతు పలికాయని, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినప్పటికి బీసీలకు ప్రజాస్వామ్య బద్ధంగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరడం లేదన్నారు. కులగణన చేయాలని ఇప్పటికే పలు రాష్ట్రాలు అసెంబ్లీలో తీర్మానం చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో సురేశ్, పండరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ యాదవ్ సేవలు చిరస్మరణీయం

సత్యనారాయణ యాదవ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, తదితరులు

కాచిగూడ, సెప్టెంబర్ 29: సంఘ సేవకుడు బి.సత్యనారాయణ యాదవ్(94) సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయం అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నింబోలి అడ్డా ప్రాంతానికి చెందిన సత్యనారాయణ యాదవ్ సంస్మరణ సభను ఆదివారం బర్కత్‌పురలో నిర్వహించారు. అనంతరం, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ నగర నాయకులు నర్సింగరావు, మధుసూదన్ రెడ్డి, నర్సింహ, శ్రీకాంత్ యాదవ్, సచిన్ యాదవ్, తదితరులు సత్యనారాయణ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కుల నిర్మూలనపై అవగాహన సదస్సు

సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

అంబర్‌పేట, సెప్టెంబర్ 29: ఐఎఫ్‌టీయూ 8వ జాతీయ మహాసభ పిలుపు మేరకు విద్యానగర్‌లో ఆదివారం కుల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. దీనికి ఇఫ్టూ జాతీయ కమిటీ సభ్యుడు విజయ్ అధ్యక్షత వహించగా, ఇఫ్టూ జాతీయ కార్యదర్శి కె.విశ్వనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వ్యవస్థ ప్రజాస్వామ్యానికి, లౌకిక వాదానికి తీవ్ర వ్యతిరేకమైనదని, ఈ వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా చార్వాకుల దగ్గర నుంచి పెరియర్ రామస్వామి, నారాయణ గురు, మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయులు తమ జీవితాంతం పోరాడారన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు వి.గోపాలరావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సరళ తదితరులు పాల్గొన్నారు.